
# విష ప్రయోగం

మల్లాది వెంకటకృష్ణమూర్తి



**ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్‌కి ఆ సమాచారం ఫోన్‌లో అందిన ఇరవై నాలుగో నిమిషానికల్లా జూబిలీ హిల్స్‌లోని పన్నెండో నెంబర్ రోడ్‌లో ఉన్న మేడం కళావతి ఇంటికి చేరుకున్నాడు.**

మేడం కళావతి ఎంతో అందగత్తె అని విని ఉన్నాడు ఇంద్రనీల్. గత రెండు నెలలుగా ఆమె పేరు ప్రతి రోజూ రాష్ట్ర దిన పత్రిక లన్నింటిలో చోటు చేసుకుంటోంది. అధికారంలో ఉన్న దాదాపు అందరు రాజకీయ నాయకులతో ఆమెకి శారీరక సంబంధాలున్నాయని, కోట్లకి మించిన ప్రజా ధనం వాళ్ళు ఆమెకి దోచిపెట్టారని ఆరోపణలెన్నో వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె ఫ్రంట్ పేజీ వార్తల్లోకి ఎక్కింది.

అయితే మేడమ్ కళావతి మాత్రం పెదవి విప్పి ఒక్క ఆరోపణని ఖండించలేదు. అసలు వార్తా పత్రికల విలేఖరులని తన దరిదాపుల్లోకి అనుమతించలేదు. తాజాగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరు ఈమె పేరుతో లింక్ చేయబడింది. ఆ కారణంగానే ఆమె మీద కోర్టులో ప్రవేశపెట్టబడ్డ కేసులేవీ కోర్టు విచారణకి స్వీకరించలేదన్న కొత్త ఆరోపణ దిన పత్రికల్లో తాజాగా నలుగుతోంది.

ఆమె అపురూప సౌందర్యవతి అని, శృంగార కళలో పిహెచ్. డి. చేసిందని పత్రికల్లో చదివి ఉన్న ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ ఆమెని చూడడానికి ఎంతో ఆసక్తిగా బయలుదేరాడు —చూసేది ఆమె డెడ్ బాడీనే అయినా...

ముందుగా ఇంద్రనీల్ ఇంట్లోని సర్వెంట్స్‌ని ప్రశ్నించాడు ఓ పావుగంటసేపు.. తర్వాత ఆమె గది బయట కాపలా ఉన్న కానిస్టేబుల్ ఇంద్రనీల్‌కి సెల్యూట్ చేశాడు. ఇంద్రనీల్‌ని లోపలికి తీసుకుని వెళ్ళాడు ఎస్. ఐ.

మేడం కళావతి బెడ్ రూమ్‌ని ముందు పరిశీలించి చూశాడు. గోడలకి కామోద్రేకాన్ని కలిగించే చిత్రాలు, గులాబీ రంగు మెత్తటి తివాచీ, మధ్యలో గుండ్రటి మంచం మీద సీలింగ్‌కి, గోడలకి నాలుగు వైపులా నిలువెత్తు అద్దాలు. ఎంతో కళాత్మకంగా ఉందా ఐశ్వర్యవంతమైన గది. ఆ గదిలో ఓ ప్రక్క పాల రాతితో చేసిన స్విమ్మింగ్ పూల్. ఆ... అందులోని నీరుతో పన్నీరు కలపడం వల్ల ఆ గదంతా పన్నీటి వాసన.

స్విమ్మింగ్‌పూల్‌కి ఇవతలి వైపు ఓ పెద్ద డ్రస్సింగ్ టేబుల్. దాని ముందున్న స్టూల్ ప్రక్కనే వెల్లకిలా పడి ఉంది మేడమ్ కళావతి శరీరం. ఆమె వంటి మీద టైట్ నిక్కర్ తప్ప మరే ఆచ్ఛాదన లేదు.

అప్పటికే అక్కడికి చేరుకుని ఆమెని పరీక్షించిన డాక్టర్ చెప్పాడు ఇంద్రనీల్‌తో.

"నా ప్రాథమిక పరీక్ష వల్ల నా కనిపించింది ఈమె విష ప్రభావంతో మరణించింది."

"ఎలాంటి విషం?" అడిగాడు ఇంద్రనీల్.

"లక్షణాలని బట్టి చూస్తే కింగ్ కోబ్రా విషంలా అనిపిస్తోంది."

"కింగ్ కోబ్రా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును."

"హైదరాబాద్‌లో అసలు ఆంధ్రప్రదేశ్‌లోనే కింగ్ కోబ్రాలు ఉన్నాయా? ఆర్ యూ షూర్?" ఆలోచనగా అడిగాడు ఇంద్రనీల్.

"ష్యూర్ —కింగ్ కోబ్రా విషం లక్షణాలు ఇంకే విషానికి ఉండవు."

ఇంద్రనీల్ వంగి శవాన్ని పరిశీలించి చూశాడు. కళ్ళు మూసుకుని ఉన్నాయి. మొహం నీలం రంగులోకి మారి ఉంది. నోట్లోంచి కారిన తెల్లటి నురగ చార కనిపిస్తోంది.

ఆమె ప్రక్కనే నేల మీద పడి ఉన్న పౌడర్ డబ్బాని చూసి ఆమె మేకప్ చేసుకుంటూండగా స్టూల్ మీంచి జారి క్రిందపడిందని గుర్తించాడు.

ఆమె శరీరాన్ని పరిశీలించి చూశాడు. ఎక్కడా పాము కాటు గుర్తు కనిపించలేదు. ఇంద్రనీల్ కానిస్టేబుల్స్‌కి సూచనలిచ్చి తనూ పాము కోసం ఆ గది, ఇల్లు వెతికాడు. ఎక్కడా ఏ పాము జాడ కనిపించలేదు. అంతేకాదు.

అతనికి ఆమె మరణానికి సంబంధించిన ఆధారాలేమీ కనపడలేదు. డ్రెస్సింగ్ టేబుల్‌ని శ్రద్ధగా పరిశీలించాడు. అనేక షేడ్స్‌లో లిప్ స్టిక్స్, అనేక రకాల పౌడర్లు ఇతర కాస్మొటిక్స్ ఉన్నాయి. ఓ జువెలరీ బాక్స్ తెరిచి ఉంది. చేతి రుమాలుతో దాని మూతని మూసి పైన ముద్రించి ఉన్న షాపు పేరు చూశాడు. తర్వాత ఇంద్రనీల్ ఆ గది లోకి పాము వచ్చే అవకాశం ఉందేమోనని పరీక్షగా చూశాడు. వెంటిలేటర్స్‌కి పర్మినెంటుగా బిగించిన అద్దాలున్నాయి. కిటికీ తలుపులన్నీ మూసి ఉన్నాయి ఒక్కటి తప్ప. అయితే అది స్విమ్మింగ్‌పూల్‌కి అవతల ఉంది. అందులోంచి పాము వచ్చినా నీళ్ళలోంచి ఇవతలికి రావాలి. నీటి పాములు తప్ప విషం పాము నీళ్ళలో ఈద లేదు కాబట్టి జరిగి ఉండదని నిర్ణయించుకున్నాడు ఇంద్రనీల్.

"మేడమ్ కళావతి నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్ వల్ల ఆమె మరణం సంభవించి ఉంటుందా ?" అనే ఆలోచనగా అడిగాడు డాక్టర్.

"తనతో శారీరక సంబంధం ఉన్న వారి పేర్లు బయట పెడతానన్న స్టేట్‌మెంటా ? నా అనుమానం కూడా సరిగ్గా అదే" చెప్పాడు ఇంద్రనీల్.

"అయితే అనుమానితుల జాబితా చాలా పెద్దదే అవుతుంది" నవ్వుతూ చెప్పాడు డాక్టర్.

"ఇది ఆత్మహత్య కావచ్చు లేదా హత్య కావచ్చు. విష ప్రయోగం జరగడం మాత్రం నిజం కదా ?" అడిగాడు ఇంద్రనీల్.

"అవును. అందువల్లే మరణం సంభవించింది."


"అది ఎలా జరిగిందీ శవాన్ని పరిశీలిస్తే తెలీ లేదా?"

"ఊహూ... వంటి మీద చిన్న గాయం కూడా లేదు. కాబట్టి ఆహారం ద్వారా జరిగి ఉండచ్చు."

"గురువారం కాబట్టి బాబా భక్తురాలైన ఆమె నిన్న రాత్రి ఏం ఆహారం తీసుకోలేదుట. ఉదయం నిద్రలేచాక బెడ్‌రూమ్ లోంచి బ్రేక్‌ఫాస్ట్‌కి బయటికింకా బయటకే రాలేదుట" చెప్పారు ఇంద్రనీల్.

"అయితే ఆహారం ద్వారా విష ప్రయోగం జరిగి ఉండదు" మేడమ్ కళావతి శవాన్ని మరో సారి నిశితంగా పరిశీలించాక చెప్పాడు డాక్టర్.

"నో సబ్ మార్క్స్ ఆన్ ది బాడీ."



"మొన్న ఒకడితో రైల్లో పరిచయం అయింది. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. తీరా రైలు దిగే ముందు వాడేమన్నాడో తెలుసా? నేను పరమ లుచ్ఛానట" అన్నాడు వంశీ.

"ఎందుకంత ఆలస్యం చేశాడు పిచ్చి వెధవ" అన్నాడు మురళి.

సురేశ్‌కుమార్, హైదరాబాద్

"నిన్న ఉదయం రాష్ట్ర ఆర్థిక మంత్రి, మధ్యాహ్నం ఓ జస్టిస్, రాత్రి ముఖ్యమంత్రి వచ్చి కొద్దిసేపు ఉండి వెళ్ళారని పని వాళ్ళు చెప్తున్నారు. ఆ సంగతి వాళ్ళ సెక్యూరిటీ మనుష్యుల్ని కూడా కనుక్కుని కన్‌ఫాం చేస్తాను. వాళ్ళలో ఎవరో ఒకరి పని అయి ఉండవచ్చుననిపిస్తోంది" చెప్పాడు ఇంద్రనీల్.

"కావచ్చు. వాళ్ళు ముగ్గురూ ఆ సెక్స్ స్కీమ్‌లో ఇన్వాల్వ్ అయి ఉన్నారు. పైగా ముఖ్యమంత్రి ద్వారా ఈమెకి రాజ్యసభ సీట్ కూడా వచ్చింది" డాక్టర్ తన అభిప్రాయం చెప్పాడు.

ఇంద్రనీల్ కొద్దిసేపు డ్రెస్సింగ్ టేబుల్ మీది వస్తువులను పరిశీలించి చూశాడు. లిప్‌స్టిక్ ద్వారా ఆ విష ప్రయోగం జరిగి ఉండచ్చా ? ఫేస్ పౌడర్ ద్వారానా ? లేక ఆమె ఉపయోగించిన సబ్బు ద్వారానా ? స్ప్రే ద్వారానా ?

అతని అనుమానాలను విన్న డాక్టర్ తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"కాకపోవచ్చు. ఆమె ఇవన్నీ రోజూ వాడే వస్తువులేగా. అయినా వాటిని తీసుకుని వెళ్ళి కెమికల్ ఎనాల్సిస్ చేస్తే మీ ఊహ కరెక్ట్ కాదో తేలిపోతుంది.

ఇంద్రనీల్ మళ్ళీ ఆలోచించాడు. వాటి ద్వారా ఈ హత్య జరగకపోయి ఉంటే మరెలా ఆ విష ప్రయోగం జరిగి ఉండచ్చు ?

ఇందాక సర్వెంట్ మెయిడ్ చెప్పిన విషయం టేబుల్ మీద ఉన్న జ్యూవెలరీ బాక్స్ చూడగానే గుర్తొచ్చింది.

"ముఖ్యమంత్రి గారు బహుమతిగా మలేషియా నుంచి తెచ్చిన ఇయర్ రింగ్స్ మా అందరికీ చూపించి తెగ మురిసిపోయింది మేడమ్."

శవం రెండు చెవులకి ఆ రెండు ఇయర్ రింగ్స్ వేలాడుతున్నాయి. దానికి మేచింగ్ రింగ్ కుడి చేతి చూపుడు వేలికి ఉంది.

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్‌కి తళుక్కున తట్టిందా ఆలోచన. అలా జరిగి ఉండచ్చా ?

వంగి శవానికున్న కుడి చెవి రింగ్‌ని విప్పి తీసి చూశాడు. చెవికి చిన్నప్పుడు పొడిపించుకున్న గుర్తు కనిపించింది. తర్వాత ఎడమ చెవి రింగుకున్న శీలని ఊడదీశాడు.

అతను చేసేది చూస్తున్న డాక్టర్ వెంటనే చిన్నగా ఈలవేసి చెప్పాడు.

"ఆదన్నమాట."

మేడం కళావతి ఎడం చెవికున్న కంత లోంచి రెండు బొట్లు రక్తం స్రవించి ఉంది. ఇంద్రనీల్ రింగ్‌ని భూతద్దంలో పరీక్షించి చూస్తే దానికున్న కాడకి ఓ ప్రక్క ఓ వైపు రంధ్రంలో పదునైన సన్నని పళ్ళు కనిపించాయి. అంతేకాదు అక్కడ బోలుగా ఉంది.

ఆ హత్యాధారాన్ని ఇంద్రనీల్ జ్యూవెలరీ బాక్స్‌లో ఉంచి మూసి జేబులో వేసుకుని చెప్పాడు.

"డాక్టర్ ! ఈ విషయం దయచేసి ఎవరికీ చెప్పకండి."

"ఏం ? ముఖ్యమంత్రికి హంతకుడిగా మినహాయింపు ఉంటుందా ? కోపంగా అడిగాడు. వివిధ స్కీంల గురించి దిన పత్రికల్లో చదివి చదివి విసిగి పోయి అతని రాజకీయ నాయకుల మీద.

"కాదు —మన రాష్ట్రంలో ఈ కేసు నమోదైతే న్యాయం జరగదని నా అనుమానం. నా పరిశోధనా వివరాలను సరాసరి సుప్రీంకోర్టుకు నివేదిస్తాను."

చిన్నగా నవ్వాడు డాక్టర్.

"అర్థమైంది" చెప్పాడు మెచ్చుకోలుగా.

ఆ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన డి. సి. పి., మరీ కొద్ది నిమిషాల తర్వాత ఏ. సి. పి. లు హడావిడిగా లోపలికి వచ్చారు.

"హత్యా ? ఆత్మహత్యా?" అడిగాడు డి. సి. పి."

"పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ వస్తే కానీ అది నిర్ణయించలేం సార్" జవాబు చెప్పాడు ఇంద్రనీల్ వాళ్ళకి సెల్యూట్ చేసి.

"ఈ కేసుని నన్నే స్వయంగా పర్యవేక్షించమని ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి సూచనలు అందాయి" చెప్పాడు డి. సి. పి.

"ఎస్ సర్."

"అదే రోజు ఇంద్రనీల్ ఎక్కిన విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగింది.

❋